క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

నరసరావుపేట: కలెక్టరేట్ సమీపంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం పేర్కొన్నారు. దీనిలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమానికి సంబంధించి తెలియ చేయటం జరుగుతుందన్నారు. కావున నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు అందరూ తప్పకుండా హాజరుకావాలని కోరారు.

పేరెంట్స్ మీట్‌ని పండుగలా నిర్వహించాలి

నూజెండ్ల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో నేడు మెగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం ఆయా పాఠశాలల్లో నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి రవిచంద్ర బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి ప్రతి విద్యార్థితో పాటు వారి తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, దాతలు, అధికారులు హాజరయ్యేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో విద్యార్థి విద్యాప్రగతి, క్రీడా ప్రగతి, ఆరోగ్య అంశాలతో కూడిన హోలిస్టిక్ రిపోర్ట్ పంపిణీ చేసి, ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా తల్లిదండ్రులతో మాట్లాడాల్సి ఉంది. తల్లిదండ్రుల మధ్య వివిధ అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందించటం జరుగుతుందన్నారు. అనంతరం డొక్కా సీతమ్మ సామూహిక మధ్యాహ్న భోజనంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

శంకరభారతీపురం పాఠశాలలో..

నరసరావుపేట: మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ జిల్లా స్థాయి కార్యక్రమం స్థానిక శంకర భారతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమం పాఠశాలలోనే జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సామాజిక గ్రామసభలు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి, వయ్యకల్లు, బొందిలిపాలెం, పిచికలపాలెం, ఇర్లపాడు, చినకంచర్ల గ్రామ పంచాయతీలో సామాజిక తనిఖీ గ్రామ సభలు బుధవారం ఉపాధి అధికారుల నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీ బత్తుల ఆవులయ్య పాల్గొని మాట్లాడుతూ 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు గ్రామ పంచాయతీల్లో ఉపాధి నిధులతో గ్రామస్థాయిలో ఉపాధి సిబ్బంది చేసిన పనులకు సంబంధించి ఆడిట్ చేశారని తదుపరి గ్రామసభల్లో వివరాలు వెల్లడించినట్లు తెలిపారు. మిగిలిన గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించిన అనంతరం మండల స్థాయిలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గ్రామసభల్లో ఎస్ఆర్పీలు, సర్పంచులు, ఉపాధి అధికారులు పాల్గొన్నారు.

ఐదు గ్రామాల్లో నేడు విద్యుత్ అంతరాయం

నాదెండ్ల: ఇర్లపాడు గ్రామ పరిధిలోని ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏడీఈ అశోక్‌కుమార్ తెలిపారు. బుక్కాపురం, రాజుగారిపాలెం, ఇర్లపాడు, ఎండుగుంపాలెం, గున్నావారిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పిల్లలూ.. భోజనం బాగుంటోందా?



నాదెండ్ల: చందవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం, ఇటీవల విద్యార్థులకు పంపిణీ చేసిన పాఠ్య, నోటుపుస్తకాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పాక్షికంగా పడిపోయిన ప్రహరీ గోడను పరిశీలించారు. గురువారం జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్ఎం సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేఘమా.. ఉరమవే!!

- ఖరీఫ్ సాగులో కరుణించని వరుణుడు
- పత్తి విత్తి మూడువారాలైన చినుకు జాడలేదు
- వర్షం కోసం రైతన్నల ఎదురుచూపు



పొలంలో పత్తి విత్తనాల పరిస్థితిని పరిశీలిస్తున్న రైతులు



వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్న రైతు

యడ్లపాడు: ఖరీఫ్‌కు ముందే రుతుపవనాలు ప్రవేశించి అధిక వర్షాలు కురిశాయి. ఈసారి వర్షాలు బాగానే కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించింది. అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. మేలో కురిసిన వానల్ని చూసి సాగుదారులు సంబరపడ్డారు. మండలం రైతులు ఈసారి రెండుపైర్లు సాగు చేయాలని సిద్ధమయ్యారు. గత కష్టనష్టాలను మరిచి మరోసారి దుక్కిదున్ని పొలంబాట పట్టారు. ఈ నేపథ్యంలో ఖరీఫ్‌ను కాస్త ముందస్తుగానే ప్రారంభించారు. తీరా పంటలు సాగు చేశాకా చినుకు జాడ లేకుండా పోయింది.

గతేడాది పొగాకు వల్ల నష్టం

మండలంలో మొత్తం సాగు విస్తీర్ణం 16 వేల ఎకరాలు ఉండగా, వీటిలో ఏటా ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటలకు 10,483 ఎకరాలు సాగు అవుతుంది. గతేడాది పత్తి 8,530 ఎకరాలు, మిరప 835 ఎకరాలు సాగు చేశారు. వర్షాధారిత పంటలైన పత్తి, మిరప పంటల్ని అత్యధిక విస్తీర్ణంలో సాగు చేసినా అగ్రభాగం పత్తిదే. గతేడాది స్థానిక రైతులు పొగాకు వైపు మొగ్గు చూపడంతో మిరప అధికంగానూ, పత్తి సాగు స్వల్పంగా తగ్గింది.

వర్షంరాక లక్ష్యం నీరుగారింది

ఒకే పంట సాగుచేసి నష్టపోతున్నామని భావించి ఈ ఏడాది రెండుపైర్లు సాగు చేయాలని మండల రైతులు లక్ష్యంగా చేసుకున్నారు. ఈ క్రమంలో తొలి పంటగా పత్తిని, రెండోపంటగా మొక్కజొన్న లేదా శనగ సాగు చేసేందుకు ప్రణాళిక చేశారు. అయితే సాగర్ కాల్వల జలాలు, కూలీల కొరత లేకుండా ఉండాలంటే సంక్రాంతి నాటికి పత్తిని తొలగించి మొక్కజొన్న లేదా పొగాకు (అనుమతి ఉన్నవారు) రెండో పంటగా సాగు చేయాలని భావించారు. ఈ క్రమంలోనే కాస్త ముందస్తుగానే పత్తిసాగును మండలంలో 80 శాతం చేపట్టారు. వర్షాలు లేకున్నా పొడి విత్తనాలను దాదాపుగా అన్ని గ్రామాల్లో విత్తుకున్నారు.

సీజన్‌లో కురవాల్సిన వానలు కనీస స్థాయిలో కురవలేదు. భూమిలోనే విత్తనం బొగిలిపోయింది. దీంతో ఎకరాకు రూ.10 నుంచి రూ.15 వేల నష్టం వాటిల్లినట్లు స్పష్టం అవుతుంది. వారి ఆశ ఇప్పుడు నిరాశైంది. ప్రధాన పంట తర్వాత పశువుల మేత తప్ప మరో పంట వేసే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో 70 శాతం లోటు వర్షపాతం

రాష్ట్రంలో జిల్లా అత్యధిక లోటు వర్షపాతం కాగా, యడ్లపాడు మండలంలో 70 శాతం లోటు వర్షపాతం నమోదైంది. కానీ జనవరి నుంచి వర్షపాతం పరిశీలిస్తే సగటు 220.1 శాతానికి, ఇప్పటికీ 221.1 శాతం నమోదు కావడం గమనార్హం. మొదటి మూడు నెలలు జీరో అయినా, ఏప్రిల్‌లో 3.2 శాతం, మేలో 135 శాతం సగటుకు మించి వర్షం పడింది. అయితే ఈ వర్షం దశల వారీగా అంతటా సమానంగా కురవాల్సి ఉండగా, ఒకేసారి కుండపోతగా ఒకటీ అరా ప్రాంతాల్లోనే పడింది. అంతేకాకుండా సాగు చేయని సమయంలో పడిన ఈ వర్షంతో రైతులకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది.

మళ్లీ దున్నుకొని విత్తుకోవాల్సిందే



12 ఎకరాల్లో పత్తిని సాగు చేశా. సాగుకు ముందున్న వాన తర్వాత లేదు. విత్తనాలు కొన్ని పగిలిపోగా, మరికొన్ని కుళ్లాయి. ఇక మొలకెత్తినవి ఎకరానికి వందకు మించి లేవు. పడివిత్తనాలు నాటించి అవి సక్రమంగా రాక, ఇబ్బందులు పడేకంటే.. మళ్లీ వాటిని దున్ని విత్తనాలు నాటాల్సిందే. విత్తుకే డబల్ ఖర్చు అవుతుంది.

–ధూళిపాళ రామ సుబ్బారావు, రైతు

చిలకరింపు వానతోనే నష్టం



పత్తికట్టెను లేపి, భూమి సిద్ధం చేసి విత్తనాలు కొని, కూలీలతో నాటించినందుకు ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడి అయింది. రెండోపంట మొక్కజొన్న వేయాలని 20 రోజుల కిందట పత్తి విత్తనాలు నాటించా. వర్షం తుంపర్లతో విత్తనాలన్నీ పాడయ్యాయి. ఇప్పుడు తిరిగి రెండోమారు కూలీచే అచ్చుతోలించి విత్తనాలు వేసుకోవాల్సిందే.

–గంధం ఏడుకొండలు, రైతు

పత్తిలో కంది అంతర్ పంటగా వేసుకోవచ్చు



మొక్క బయటకు వస్తే వర్షం వచ్చే వరకు 19.19.19 కిలో పైపాటుకు పిచికారీ చేసుకుంటే వారంరోజులు పాడవ్వకుండా ఉంటుంది. జులై నెలాఖరులోపు పత్తిని మళ్లీ విత్తుకోవచ్చు. లేదా పత్తిలో అంతర్ పంటగా కందిని సాగు చేసుకుంటే మేలు. రెండు పంటల ఆదాయం పొందొచ్చు. ప్రకృతి వైపరీత్యాల్లో సంభవించినా ఏదో ఒక పంట రైతుల్ని ఆదుకుంటుంది.

–ఎ.హరిప్రసాద్, మండల వ్యవసాయ అధికారి, యడ్లపాడు

నేడు వెలుగు ఆధ్వర్యంలో సమావేశం

యడ్లపాడు: మండల సమాఖ్య సమావేశం గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏపీఎం కె.రవీంద్రకుమార్ తెలిపారు. యడ్లపాడు మండల సమైక్య అధ్యక్షురాలు ఆర్.నాగలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో వార్షిక ప్రణాళిక, మొబైల్, డ్వాక్రా సంఘాల బుక్ కీపింగ్, స్త్రీనిధి నిధుల రికవరీ, బ్యాంక్ లింకేజ్ రుణాల గ్రౌండింగ్, కొత్త అప్పులు, ఆడిట్‌కు సంబంధించిన అంశాలపై చర్చించడం జరుగుతుందని వెల్లడించారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్: రైల్లో నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జొన్నలగడ్డ గ్రామ సమీపంలో రైలులో ప్రయాణం చేస్తూ జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు నీలం, నలుపు అరచేతుల చొక్కా, నలుపు రంగు లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడి జేబులో మద్దిల రామకృష్ణ తండ్రి పేరు లక్ష్మయ్య, గోదికొమ్ము సింగవరం, విజయనగరం అనే పేరు గల ఆధార్ కార్డు గుర్తించారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిసిన యెడల నరసరావుపేట రైల్వే పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఎస్ఐ శ్రీనివాస నాయక్ తెలిపారు.

నిరుద్యోగ యువతకు ట్యాలీలో శిక్షణ

రొంపిచర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో దీన్–దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన పథకం ద్వారా నిరుద్యోగ యువతకు గుంటూరు సన్‌స్కిల్ సెంటర్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ మొబలైజర్ కొణతం విద్యాసాగర్ తెలిపారు. ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ కల్పన చేయడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉండి ఇంటర్, ఆపైన చదువులు చదివిన వారికి ట్యాలీ, వేర్ హౌస్, ఎగ్జిక్యూటివ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9959939536, 8885181110 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

బాధ్యతగా పనిచేస్తే పూర్వవైభవం ఖాయం

నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి దిశానిర్దేశం



మారూరి శివారెడ్డిని అభినందిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ పదవులు స్వీకరించిన వారందరూ బాధ్యతగా పనిచేసి జిల్లాలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని మాజీ ఎమ్మెల్యే, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. నరసరావుపేట మండల ఉపాధ్యక్షులుగా నియమితులైన మారూరి శివారెడ్డి తన కేసానుపల్లి గ్రామం, ఎస్ఆర్‌కేటీ కాలనీ వాసులతో బుధవారం పార్టీ కార్యాలయంలో డాక్టర్ గోపిరెడ్డిని కలిసి దుశ్శాలువ కప్పి పూల దండలతో సత్కరించి తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈసందర్భంగా గోపిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు వైఎస్సార్ సీపీకి చెందిన వ్యక్తులే ఎమ్మెల్యేలుగా గెలిచారన్నారు. పల్నాడు ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించటంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలుచేస్తూ జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయటం జరిగిందన్నారు. అయితే గత ఎన్నికల్లో కూటమి నాయకులు మోసపు వాగ్దానాలతో ప్రజలను తమవైపుకు తిప్పుకోవటంతో ఓటమి పాలయ్యామన్నారు. ఇప్పుడిప్పుడే ప్రజలు కూటమి నేతల మోసాలను తెలుసుకుంటున్నారని అన్నారు. రాబోయే రోజులు మనవేనని, మళ్లీ వచ్చే ఎన్నికల్లో పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని, అందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. మారూరి శివారెడ్డి పార్టీ ఏర్పడినప్పటి నుంచి కొనసాగుతూ కేసానుపల్లి, ఎస్ఆర్‌కేటీ కాలనీల్లో పార్టీ అభివృద్ధికి కృషిచేశారన్నారు. దీనిని గమనించిన కేంద్ర నాయకత్వం పార్టీ పదవి అప్పగించిందన్నారు. మారూరి మాట్లాడుతూ తనకు అప్పచెప్పిన బాధ్యతలను నెరవేర్చి మళ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. కాగా, సంతగుడిపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పల్లకి అంజనారెడ్డి, మండల అధ్యక్షుడు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో పలువురు డాక్టర్ గోపిరెడ్డిని కలిసి కార్యనిర్వాహక అధ్యక్ష పదవి స్వీకరించినందుకు అభినందించి సన్మానించారు. పలువురు గ్రామనాయకులు పాల్గొన్నారు.

రెండు నెలల కోమా నుంచి బయటపడ్డ వృద్ధురాలు!

స్వస్థత చేకూర్చిన మహాత్మాగాంధీ హాస్పిటల్ న్యూరాలజీ వైద్యులు



కోలుకున్న పేషెంట్‌తో డాక్టర్ సౌమ్య, సిబ్బంది

నరసరావుపేట: పట్టణంలోని మహాత్మాగాంధీ హాస్పిటల్‌లోని న్యూరాలజీ విభాగంలో డాక్టర్లు అరుదైన చికిత్స నిర్వహించి సుమారు 65 ఏళ్ల వృద్ధురాలికి పునర్జీవం కల్పించారు. మంగళవారం సాయంత్రం హాస్పిటల్ ఆవరణలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో హాస్పిటల్ ఎం.డి, ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి, న్యూరాలజిస్టు డాక్టర్ సౌమ్య వివరాలను వెల్లడించారు. సుమారు రెండునెలల క్రితం ఓ వృద్ధురాలు తలనొప్పి, మూర్ఛలతో తీవ్ర రక్తస్రావంతో కోమాలోకి వెళ్లగా ఆమె బంధువులు హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. డాక్టర్ సౌమ్య ఆమెను పరీక్షించి తలలోని ఒక రక్తనాళం ఉబ్బి పగిలిపోవడం వల్ల గ్రేడ్–4 బ్రెయిన్ హెమరేజ్‌కు ఆ వృద్ధురాలు గురైనట్లు కనుగొన్నారు. ఈ పరిస్థితుల్లో వారు 80 శాతం మంది మృతి చెందుతారని, కోమా నుంచి బయట పడటం చాలా అరుదుగా జరుగుతుందన్నారు. పల్నాడులోనే తొలిసారిగా ఆ వృద్ధురాలికి తమతో పాటు ఇంటర్‌వెన్షనల్ రేడియాలజిస్టు డాక్టర్ సుధీర్ చక్రవర్తి, న్యూరో సర్జన్ డాక్టర్ విద్యాసాగర్, హాస్పిటల్ క్రిటికల్‌కేర్ టీం, న్యూరో ఫిజీషియన్ థెరపిస్టు డాక్టర్ అనీల్‌రెడ్డి పలురకాల శస్త్ర చికిత్స నిర్వహించి ప్రత్యేకమైన మందుల సహాయంతో చికిత్స చేసి ప్రధాన పాత్ర పోషించారన్నారు. సుమారు రెండు నెలల పాటు కోమాలో ఉన్న ఆ వృద్ధురాలు ఇప్పుడు కోలుకొని వెంటిలేటర్ సహాయం లేకుండా శ్వాస, ఆహారం తీసుకుంటూ మాట్లాడుతుందన్నారు. ఇది తమకు చాలా ఆనందదాయకంగా ఉందన్నారు. హాస్పిటల్ నర్సింగ్ సిబ్బంది సేవలు అందజేశారని వెల్లడించారు.

సొసైటీల చైర్‌పర్సన్‌లు, పర్సన్ల నియామకం



రొంపిచర్ల: మండలంలోని ఆరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు నూతన పాలక వర్గాలను నామినేట్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సొసైటీలోని ముగ్గురు సభ్యులతో కమిటీని నియమించింది. ఈ ముగ్గురులో ఒకరు చైర్ పర్సన్‌గా, మరో ఇద్దరు పర్సన్‌లుగా నియమించారు. విప్పర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్ పర్సన్‌గా మాజీ ఎంపీపీ జల్లిపల్లి శేషమ్మను నియమించగా, పర్సన్‌లుగా యామర్తి అంజలీదేవి, గంగారపు శ్రీనివాస రెడ్డి, సంతగుడిపాడు ప్యాక్స్‌కు పునుగోటి శ్రీనివాసరావు చైర్ పర్సన్‌గా, పర్సన్‌లుగా మోదుగుల కొండలు, కల్లూరి ఆంజనేయులు. బుచ్చిబాపన్నపాలెంకు చైర్ పర్సన్‌గా సూరాబత్తుల రామారావు, పర్సన్‌లుగా ఎం. కొండారెడ్డి, బండారు పిచ్చమ్మ, రొంపిచర్ల ప్యాక్స్‌కు పల్లెల వెంకటరత్నారెడ్డి చైర్‌పర్సన్‌గా, వీరవల్లి సుబ్బయ్య, ఇంటూరి రాజశేఖర్‌రెడ్డి పర్సన్‌లుగా, అన్నవరం ప్యాక్స్‌కు కుందేటి రామబ్రహ్మం చైర్ పర్సన్‌గా, కామినేని వెంకట రంగారావు, గుండవనేని కోటేశ్వరరావులను పర్సన్‌లుగా, సుబ్బయ్యపాలెం సొసైటీకి ఇంటూరి వెంకట ప్రసాద్ చైర్‌పర్సన్‌గా, పానుగోటి పద్మజ, రొంతు బ్రహ్మయ్యలను పర్సన్‌లుగా నియమించారు. అలాగే నరసరావుపేట మండలంలోని లింగంగుంట్ల సొసైటీకి చైర్‌పర్సన్‌గా కన్యదార రాజు, పర్సన్‌లుగా షేక్ గూడు మహబూబ్ బాషా, సుద్దపల్లి నవీన్, జొన్నలగడ్డ సొసైటీకీ చైర్ పర్సన్‌గా యర్రం రాంబాబు, పర్సన్‌లుగా ముప్పాళ్ల వెంకట నరసింహారావు, దుగ్గి బాబురావు, ఇక్కుర్రు సొసైటీకి చైర్ పర్సన్‌గా కొల్లు వెంకటేశ్వర్లు, చెరుకూరి కావేరి, కుంబా పోలయ్యలను నియమిస్తూ ప్రభుత్వం ఈ నెల 8వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది.

కార్మిక వ్యతిరేక విధానాలపై భగ్గుమన్న వామపక్షాలు



వినుకొండ శివయ్యస్థూపం వద్ద నిర్వహించిన ర్యాలీ

- వేర్వేరు ప్రాంతాల్లో ర్యాలీలు, ప్రదర్శనలు
- కూటమి కుతంత్రాలపై నాయకుల కన్నెర్ర



చిలకలూరిపేటలో బంద్ నిర్వహిస్తున్న నాయకులు

వినుకొండ: దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్మికుల సమ్మె పల్నాడు జిల్లా వినుకొండ కమ్యూనిస్టులు పెద్ద ఎత్తున నినదించారు. స్థానిక ఏనుగుపాలెం రోడ్డు లో పార్టీ కార్యాలయం వద్ద నుంచి శివయ్య స్తూపం వరకు ర్యాలీ చేపట్టారు. జిల్లా సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి తోట ఆంజనేయులు కార్మిక సంఘం కార్యదర్శి షేక్ ఫిరోజ్ భాస్కర్ దుర్గాప్రసాద్ వెంకటేశ్వర్లు ఓబులాపురం అంజనేయులు గుంటి నాగేశ్వరరావు పంది హరికృష్ణ ఎస్కే బాబు లింగా చారి ముప్పాళ్ళ ప్రసాద్ ప్రకాష్ పాల్గొని సమ్మెను జయప్రదం చేశారు. ర్యాలీకి సీపీఎం పార్టీ వినుకొండ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు నాయకత్వం వహించగా అంగన్‌వాడీ, ఆశ, భవన నిర్మాణ సంఘం, ఆటో వర్కర్స్ యూనియన్,, మధ్యాహ్న భోజన పథకం, బీమా ఉద్యోగులు, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘల నాయకుల పాల్గొన్నారు.

బొల్లాపల్లి: మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం సార్వత్రిక సమ్మె నిర్వహించారు. జిల్లా సీఐటీయూ అధ్యక్షులు కె.హనుమంత రెడ్డి మాట్లాడుతూ లేబర్ కోర్టులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో నాయకులు ఎస్.కోటిరెడ్డి చాంద్ భాష అంగన్ వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

రొంపిచర్ల: దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం అంగన్‌వాడీ, ఆటో వర్కర్స్, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చెరువుకట్ట సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి సరికొండ వెంకటేశ్వరరాజు , కౌలు రైతు సంఘం నాయకుడు కామినేని రామారావు, రైతు సంఘం నాయకుడు బండారుపల్లి నాగేశ్వరరావు, గవ్వరాజు లక్ష్మీ, లూథియానా, కె. అంజమ్మ, ఎస్.వి. నాగమల్లేశ్వరి, బాలకోటయ్య, నరేష్, ఫణీంద్ర, శ్రీను, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

నూజెండ్ల: దేశ వ్యాప్తంగా సీఐటీయూ, కార్మిక, కర్షక సంఘాల పిలుపు మేరకు బుధవారం జరిగిన సమ్మెలో నూజెండ్ల మండల పరిదిలోని అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వివిధ రంగాల అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా మండల కేంద్రమైన నూజెండ్ల గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నాయకులు జి.సీతారామయ్య, అశీర్వాదం, సత్యనారాయణ, సలోమి, జి.పద్మ పాల్గొన్నారు.

చిలకలూరిపేట: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తొలగించి, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు కోరారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం బంద్ నిర్వహించారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్ నుంచి కళామందిర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు, సీఐటీయూ మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎం.రాధాకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భారీ విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సపాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన రాజనాల జగన్నాధరావు, పార్వతిదేవి దంపతులు రూ.1,00,116లు విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో బుధవారం ఈవో నలబోతు మాధవీదేవిని కలిసి విరాళం చెక్‌ను దాతలు అందించారు. ఆలయ నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొత్తలంక కార్తికేయ శర్మ, నందూరి కాశీకృష్ణ పాల్గొన్నారు.

పంటల బీమాపై విస్తృత ప్రచారం

నాదెండ్ల: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో నమోదు చేయించుకుంటే విపత్కర పరిస్థితుల్లో నష్టపరిహారం పొందవచ్చని మండల వ్యవసాయాధికారి శ్రీలత చెప్పారు. మండలంలోని గణపవరం, తూబాడు శివారు గున్నావారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఈవో శ్రీనివాసరావు, లక్ష్మా నాయక్, వెంకటేష్, అశోక్‌రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నూజెండ్ల: రైతులు సాగు చేసిన పంటలకు ఈ నెల 31వ తేదీ లోపు ప్రీమియం చెల్లించి పంటల బీమా పథకం సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు నాయక్ తెలిపారు. మండల కేంద్రమైన నూజెండ్ల రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు.

రొంపిచర్ల: సమగ్ర ఎరువుల యాజమాన్యాన్ని చేపట్టి ఎరువుల వాడకాన్ని తగ్గించి భూమి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత రైతులందరిపై ఉందని డీడీఏ శివకుమారి అన్నారు. మండలంలోని మునుమాక, ముత్తనపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు.